క్లుప్తంగా

పెన్‌గంగ వద్ద పూజలు



తాంసి(కె) వద్ద పెన్‌గంగ నది వద్ద నైవేద్యం సమర్పిస్తున్న భక్తులు

తాంసి: భీంపూర్ మండలంలోని వడూర్, తాంసి(కె), అంతర్గాం, గొల్లఘాట్, గుబిడి గ్రామాల సరిహద్దు గుండా ప్రవహిస్తున్న పెన్‌గంగ నదికి రైతులు, భక్తులు పూజలు నిర్వహించారు. ప్రతిఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు రైతులు గంగానదికి పూజలు చేయడం ఆనవాయితీ. సోమవారం పెన్‌గంగ నదిఒడ్డున పూజలు అనంతరం నైవేద్యం సమర్పించారు. దీపాలు వెలిగించి తెప్పలపై ఉంచి నదిలో వదిలారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, సకాలంలో వర్షాలు కురవాలని గంగాదేవిని వేడుకున్నారు. అనంతరం గంగాజలాన్ని తీసుకెళ్లి రైతులు చేన్లలో చల్లుకున్నారు.

పీసీసీ అధ్యక్షుడిని కలిసిన గజేందర్



రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న గజేందర్

నేరడిగొండ: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బోథ్ నియోజకవర్గ నాయకుడు ఆడే గజేందర్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. జూన్ 18న నిర్వహించే క్విజ్ పోటీల్లో నియోజకవర్గంలో 20 వేల మంది యువతీ, యువకులు పాల్గొనేలా అవగాహన కల్పిస్తామన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఇచ్చోడ: దేశ్‌ముఖ్‌నగర్ కాలనీలో విద్యుత్ సౌకర్యం కల్పించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సిర్ర దేవేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు చిలుక దేవిదాస్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విద్యుత్ కార్యాలయం ఎదుట కాలనీవాసులతో కలిసి సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతపదేళ్ల నుంచి దేశ్‌ముఖ్‌నగర్ లో విద్యుత్ సౌకర్యం లేక పోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అధికారులు, నాయకులు పట్టించుకుని విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఐ మండల కార్యదర్శి కల్లెపెల్లిగంగాయ్య, కాలనీవాసులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ ఆవిర్భావ వేడుకలు



జెండా ఆవిష్కరిస్తున్న భుజంగ్‌రావు

ఉట్నూర్‌రూరల్: టీపీటీఎఫ్ ఆవిర్భావ వేడుకలను మండల కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. టీపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో జెండా విష్కరించారు. రాష్ట్ర కార్యదర్శి ఆతర భుజంగ్‌రావు, జిల్లా నాయకులు ఆత్రం సుగుణ, శ్యాంరావు, జ్ఞానేశ్వర్, గంగాసాగర్, గంగాసాగర్, సుంగు తదితరులు ఉన్నారు.

విగ్రహావిష్కరణకు విరాళం



విరాళం అందిస్తున్న సాకటి దశరథ్

బోథ్: మండలంలోని పాచ్పర గ్రామంలో హనుమాన్ విగ్రహావిష్కరణ సందర్భంగా సోమవారం బీజేపీ రాష్ట్ర గిరిజన మోర్చా అధికార ప్రతినిధి సాకటి దశరథ్ రూ.20 వేల ఆర్థికసాయం ప్రకటించారు.మండల కన్వీనర్ సుభాష్ సూర్య, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అశోక్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటేష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, జిల్లా కార్యదర్శి రంజిత్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు బారె భోజన్న తదితరులు పాల్గొన్నారు.

కాడి దూరం..అద్దె భారం

- వ్యవసాయంలో పెరుగుతున్న యాంత్రీకరణ
- ట్రాక్టర్ గంటకు రూ.వెయ్యి నుంచి రూ.1200
- రైతులపై ఆర్థికభారం



ట్రాక్టర్‌తో పొలంలో దుక్కి దున్నుతున్న దృశ్యం

తాంసి: వ్యవసాయ పనులకు రైతులు వినియోగించే కాడెద్దులు క్రమంగా కనుమరుగవుతున్నాయి. ఓ వైపు సాగు ఖర్చులు పెరుగుతుండడం, మరోవైపు కాడెడ్ల వినియోగం తగ్గడం, పశుగ్రాసం పెంపకానికి స్థలం లేక పశువులను పోషించడం రైతులకు భారమవుతోంది. దీంతో వాటిని విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వానాకాలం సాగు ప్రారంభం కావడంతో చాలామంది యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. చిన్న, సన్నకారు రైతులు ట్రాక్టర్లపైనే ఆధారపడుతున్నారు. వీటి వినియోగం పెరగడంతో డిమాండ్ కూడా ఏర్పడింది. యజమానులు ట్రాక్టర్ గంటకు రూ.వెయ్యి నుంచి రూ.1200 వరకు వసూళ్లు చేస్తున్నారు. మరో గత్యంతరం లేక పలువురు రైతులు సాగులో ఈ ట్రాక్టర్లను ఉపయోగిస్తున్నారు. ఏటేటా పంటల సాగు, విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు ధరలకు తోడు, కూలీల ధరలు పెరిగాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సాగులో పెరిగిన యాంత్రీకరణ

వ్యవసాయ యాంత్రీకరణ గ్రామాల్లో పుంజుకుంది. వ్యవసాయంతోపాటు ఇతర పనులకు ట్రాక్టర్ వినియోగం తప్పనిసరైంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యాంత్రీకరణనే ప్రోత్సహిస్తున్నాయి. రాయితీపై ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు అందజేస్తోంది. ఈ క్రమంలో వ్యవసాయ పనులకు రైతులు ట్రాక్టర్లు వినియోగిస్తున్నారు. చేలల్లో పత్తి కర్రలు తొలగించడానికి ఎకరాకు రూ.800 నుంచి రూ.900 వరకు చెల్లిస్తున్నారు. దుక్కి దున్నేందుకు ఎకరాకు రూ.800 నుంచి రూ.1000 వరకు చెల్లించాల్సి వస్తోంది. విత్తనాలు వేసే సమయంలో భూమిని చదును చేయడానికి రోటవేటర్ కోసం ఎకరాకు రూ.1000 నుంచి రూ.1200 వరకు చెల్లించి పనులు చేపడుతున్నారు.

పనులకు ట్రాక్టరే దిక్కు



గతంలో పంట చేల్లో పనులకు కాడెద్దులకు అరకకు కట్టి పనులు చేసేవాళ్లం. పత్తి కర్రలు మొదలుకుని దుక్కి దున్నడం, చదును సైతం అరకను కూలీలతో చేపట్టేవాళ్లం. ప్రస్తుతం కాడెడ్లు లేవు. ట్రాక్టర్ ద్వారా వ్యవసాయ పనులు చేస్తున్నాం. విత్తనాలు వేయడం, పంటకోత, తరలింపు తదితర పనులు చేపడుతున్నాం.

– తోట ఉశన్న, రైతు, తాంసి

యంత్రాలతోనే పని సులువు



అద్దె ట్రాక్టర్‌తో పంటచేల్లో పనులు చేపట్టడం ద్వారా కొంత ఆర్థిక భారం పడుతుంది. కాడెడ్ల వినియోగం తగ్గడం, పశుగ్రాసం పెంపకానికి సరైన స్థలం లేక పశువులను విక్రయించాల్సి వస్తుంది. అరక ద్వారా చేపట్టే పనులను యంత్రాల ద్వారా సులువుగా చేయవచ్చు. ఆర్థికంగా కొంత ఖర్చు ఎక్కువైనా పనులు సులువు అవుతున్నాయి.

– కోకటి రాజు, రైతు, వడ్డాడి గ్రామం

అటెన్షన్ ప్లీజ్ మరుగుదొడ్లు నిర్మించాలి



నేరడిగొండ: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో మరుగుదొడ్లు లేకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. సమావేశాలతోపాటు పాఠశాలలకు సంబంధించిన విషయాలపై కార్యాలయానికి వస్తే ఇక్కడ ఒంటికి.. రెంటికి మరుగుదొడ్లు లేకపోవడంతో సమీపంలోని ఇతర కార్యాలయాలకు వెళ్లాల్సిన దుస్థితి. అధికారులు స్పందించి వసతులు కల్పించాలని కోరుతున్నారు.

– అధికారి: భూమారెడ్డి, ఎంఈవో, నేరడిగొండ, సెల్: 94934 30234

విశ్వబ్రాహ్మణ సభకు రావాలని ఆహ్వానం



ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్‌ను ఆహ్వానిస్తున్న నాయకులు

బోథ్: ఆదిలాబాద్‌లోని గాయత్రి గార్డెన్‌లో జూన్ 6న జరిగే విశ్వబ్రాహ్మణ సంఘం సభకు రావాలని ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్‌ను ఆదిలాబాద్‌లోని ఆయన నివాసంలో సంఘం నాయకులు కలిసి ఆహ్వానించారు. సంఘం అధ్యక్షుడు పండకంటి అజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి స్వామి, కోశాధికారి దశరథ్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేడిచెల్మ ప్రవీణ్‌కుమార్, రవీందర్, చామంతుల శ్రీకర్, ప్రసాద్, పాపేశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి స్థలం కేటాయించండి

విశ్వబ్రాహ్మణ సంఘం భవన నిర్మాణానికి రెండెకరాల స్థలం కేటాయించాలని కోరుతూ బోథ్ తహసీల్దార్ అతికోద్దీన్‌కు మండల విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. భవన నిర్మాణానికి ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ సానుకూలంగా ఉన్నారని మండల అధ్యక్షుడు శ్రీకర్ తెలిపారు. శ్రీనివాస్, రవింతర్, ప్రవీణ్, ప్రసాద్, పాపేశ్వర్, దాసు, సంతోష్, విజయ్, లక్ష్మణ్ ఉన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతికి కృషి



అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే, దళిత సంఘాల నేతలు

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: అన్నివర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషిచేస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. కులమతాలకతీతంగా ప్రతి ఒక్కరి ఆకాంక్షలను నిజం చేసేలా పాటుపడుతున్నామని తెలిపారు. జిల్లాకేంద్రంలోని జూబ్లీహిల్స్ కాలనీలో మాదిగ సంక్షేమ సంఘానికి కేటాయించిన స్థలానికి సోమవారం ఆయన విచ్చేశారు. ఆ స్థలంలో మైసమ్మ తల్లికి పూజ చేశారు. ముందుగా బీఆర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తాను మాట ఇస్తే ఆ మాటకు కట్టుబడి ఉండే వ్యక్తిని అన్నారు. త్వరలో సంఘ భవన నిర్మాణ కోసం నిధులు మంజూరు చేస్తానన్నారు. అక్టోబర్‌లో ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉన్నందున ఆలోపు నిధులు మంజూరయ్యేలా చూస్తానన్నారు. నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేసేలా కృషి చేస్తానన్నారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, దళిత సంఘాల నాయకులు అజయ్, మనోజ్, చందాల రాజన్న, దయాకర్, నవీన్, ఏవన్, నాగన్న, నక్క రాందాస్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ పంటను కొనుగోలు చేస్తాం



తాంసిలో జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్



జైనథ్: జొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అడ్డి భోజారెడ్డి

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్

తాంసి: రైతులు పండించిన ప్రతీ పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్ అన్నారు. మండల కేంద్రంలోని సబ్ మార్కెట్‌యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డితో కలిసి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రానికి పంటను తీసుకొచ్చిన రైతును సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేనివిధంగా రైతుల సంక్షేమానికి తెలంగాణలో పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ధనుంజయ్, రైతుబంధు సమితి మండల అధ్యక్షుడు గోవర్ధన్, వైస్ ఎంపీపీ రఘు, మార్కెట్ డైరెక్టర్ కొడాల మహేందర్, ఏవో రవీందర్, సొసైటీ సీఈవో కేశవ్, నాయకులు అరుణ్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జైనథ్: రైతు సంక్షేమమే ప్రభుత్వం ధ్యేయమని డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్‌లో అధికారులు, నాయకులతో కలిసి సోమవారం జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం క్వింటాల్ రూ. 2970 చెల్లించి జొన్న కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, జెడ్పీటీసీ తుమ్మల అరుంధతి, ఏఎంసీ చైర్మన్ జి.సునీల్, వైస్ చైర్మన్ వేణుగోపాల్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, నాయకులు తుమ్మల వెంకట్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

దళితబంధులో అధిక యూనిట్లు అందించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎదులాపురం: త్వరలో అందించే దళితబంధులో మాంగ్ కులస్తులకు అధిక యూనిట్లు అందించాలని మాంగ్ సమాజ్ జిల్లా ఇన్‌చార్జి గాడేకర్ పరశురాం డిమాండ్ చేశారు. రాష్ట్ర సంఘం ఆదేశాల మేరకు పలు గ్రామాల కులబంధువులతో కలిసి ఎమ్మెల్యే జోగురామన్నను జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దళితబంధులో అధిక యూనిట్లు అందించాలని, హైదరాబాద్ మాంగ్ సమాజ్ ఆత్మగౌరవ భవనానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. నాయకులు సచిన్, కాంబ్లే కచరు, దత్తు, జాదవ్ శ్యామ్, సుధాకర్, రాందాస్, మధుకర్, విష్ణు, సూర్యవంశీ, దేవ్‌రాజ్, ఈశ్వర్, ఆనంద్, సాయికుమార్ ఉన్నారు.

'దాడులను ఆపాలి'

ఎదులాపురం: మణిపూర్‌లో ఆదివాసీ కుకీ, నాగ గిరిజన తెగలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్ ఓ ప్రకటనలో ఖండించారు. ఆ రాష్ట్ర జనాభాలో మెజారిటీగా ఉన్న మైతీ కులస్తులలో తమ బలాన్ని సుస్థిరానికి అధికార బీజేపీ యత్నిస్తుందన్నారు. అందులో భాగంగానే ఈ దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ దాడులు ఆపడానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని కోరారు.

మేరు కార్యవర్గం ఎన్నిక

బోథ్: మండల మేరు సంఘం కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గట్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మణ్, కోశాధికారిగా భాస్కర్, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన గంగాధర్‌ను శాలువా కప్పి సన్మానించారు.

యువత భవితే కాంగ్రెస్ నినాదం



కరపత్రం విడుదల చేస్తున్న విశ్వప్రసాద్

నార్నూర్(ఆసిఫాబాద్): యువత భవితే కాంగ్రెస్ నినాదం.. అమరుల ఆశయ సాధనే తమ లక్ష్యమని డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ అన్నారు. నార్నూర్ మండల కేంద్రంలోని గాంధీ చౌక్ వద్ద యూత్ డిక్లరేషన్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతను ప్రోత్సహించేందుకు రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిజిస్ట్రేషన్ లింక్ పొందేందుకు 76618 99899 నంబర్‌కి మిస్డ్ కాల్ ఇవ్వాలని సూచించారు. విజేతలకు ప్రత్యేక బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే ప్రతీ నియోజకవర్గానికి 40 ప్రోత్సాహక బహుమతులు ప్రదానం చేస్తామని వెల్లడించారు. 16 నుంచి 35 సంవత్సరాల వారు జూన్ 1 లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు మర్సుకోల సరస్వతి, యూసుఫ్‌ఖాన్, జాక్రుల్లా ఖాన్, కైలాస్‌నాయక్, విలాస్ నాయక్, దేవరావు, సత్తార్, కార్తీక్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

పంట అమ్ముకునేదెలా ?

- ఆన్‌లైన్ నమోదులో అధికారుల నిర్లక్ష్యం
- ఎమ్మెల్యేకు విన్నవించిన జామిడి గ్రామ రైతులు



ఎమ్మెల్యేకు సమస్యను తెలుపుతున్న రైతులు

తాంసి: వ్యవసాయశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మండలంలోని జామిడి గ్రామ రైతులు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. ఎంతో శ్రమించి పండించిన జొన్న పంట ఆన్‌లైన్‌లో వివరాలు నమోదు చేయకపోవడంతో అమ్ముకోవడానికి తిప్పలు పడుతున్నారు. మండల కేంద్రంలో జొన్న పంట కొనుగోలు కేంద్రం ప్రారంభానికి సోమవారం విచ్చేసిన ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావ్‌ను కలిసి తమ సమస్యను విన్నవించారు. ఆన్‌లైన్‌లో జొన్న పంట వివరాల నమోదు కాలేదని తాంసి కొనుగోలు కేంద్రంలో కొనడం లేదన్నారు. వ్యవసాయశాఖ అధికారులతో మాట్లాడి పంట కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీఇచ్చారు. రైతులు హరీశ్, అమర్‌రెడ్డి, వినోద్‌రెడ్డి, కిరణ్ తదితరులు ఉన్నారు.

'రెజ్లర్ల అరెస్ట్‌ను ఖండిస్తున్నాం'



మాట్లాడుతున్న జగన్‌సింగ్

ఎదులాపురం: భారత రెజ్లర్ల అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకుడు జగన్‌సింగ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రజాపంథా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రెజ్లర్లను లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ, బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని రెజ్లర్లు సాక్షి మాలిక్, భజరంగ్ పునియా, వినేష్ పొగట్‌లు శాంతియుతంగా ఆందోళన చేస్తున్నారని అన్నారు. పార్లమెంట్ ప్రారంభోత్సవం రోజున దారుణంగా వారిని ఈడ్చుకెళ్లి అరెస్టు చేయడం అప్రజాస్వామికమన్నారు. బేటి బచావో బేటి పడావో అంటే ఇదేనా అని ప్రశ్నించారు. సమావేశంలో ప్రజాపంథా నాయకులు ఉమ్రే నితిన్, మేస్రం దినేష్, రఫిక్ పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం



సాంగ్వీలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న సాజిద్‌ఖాన్, సుజాత

జైనథ్: హామీల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత ఆరోపించారు. ఇంటింటికీ మన కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని సాంగ్వి(కే) గ్రామంలో సోమవారం వీరు పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ వైఫల్యాలను ఎండగట్టారు. రుణమాఫీ పేరిట రైతులను మోసం చేసిందన్నారు. డబుల్ బెడ్రూంలు, నిరుద్యోగ భృతి హామీలు గాలిమూటలయ్యాయని ఎద్దేవా చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ వరంగల్, సరూర్‌నగర్ డిక్లరేషన్‌లను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ, యువతకు రూ.4 వేల నిరుద్యోగ భృతి, పేదలకు ఇందిరమ్మ ఇళ్లు, రూ.500లకే వంట గ్యాస్ అందిస్తామన్నారు. ఏఎంసీ మాజీ చైర్మన్ అల్లూరి సంజీవ్‌రెడ్డి, నాయకులు నాగన్న, విఠల్, రజనీకాంత్, నితిన్, నగేష్, అశోక్, ప్రభాకర్, సుదర్శన్, భూమారెడ్డి, వసంత్, గంగన్న, నాందేవ్, వెంకటి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవం

నేరడిగొండ: మండల కేంద్రంలోని శబరి మాతాజీ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాలను మంగళవారం నుంచి నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. శబరిమాతాజీ విగ్రహ ఊరేగింపు, పూజలు, హోమం, జలాధివాసం, గ్రామస్తులతో కలశ పూజ ఉంటుందని పేర్కొన్నారు. బుధవారం ధాన్య దివాస్, పుష్ప దివాస్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. గురువారం హోమం, స్వాతినక్షత్రయుక్త, మిథునలగ్న పుష్కాంశంలో ఉదయం విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తారని పేర్కొన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రతిభా పరీక్షలో ప్రతిభ

బోథ్: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలల ఇటీవల పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన శ్రీరామోజీ సాహితి అనే విద్యార్థిని ఇటీవల శ్రీమేధా చారిటబుల్ ట్రస్టు నిర్వహించిన ప్రతిభా పరీక్షలో ప్రతిభ కనబర్చింది. విద్యార్థినికి ట్రస్టు నుంచి కార్పొరేట్ కళాశాలలో ఇంటర్, జేఈఈ, ఐఐటీ విద్యాబోధనను ఉచితంగా అందించనుంది. ప్రిన్సిపాల్ ఉమేశ్‌రావు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

వీవోఏల అరెస్టు అప్రజాస్వామికం

ఇచ్చోడ: వీఏలను అరెస్టు అప్రజాస్వామికమని సంఘం నాయకులు రవీందర్‌సింగ్, రవికాంత్, గంగాధర్, మల్లేశ్, రాహుల్, శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టే ధర్నాకు వీవోఏలను ఉదయం 5 గంటలకు ఇళ్ల వద్దనే అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించడం అన్యాయన్నారు.

ఆలయ వార్షికోత్సవం

తాంసి: పొన్నారి గ్రామంలోని మహాలక్ష్మీ ఆలయ 5వ వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పిండి వంటలతో తయారుచేసిన నైవేద్యాలను సమర్పించారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నర్సింగ్ పాల్గొన్నారు.

గురుకులాలకు ఎంపిక

తాంసి: కప్పర్ల ప్రాథమిక పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు గురుకులాలకు ఎంపికయ్యారు. సోమవారం విడుదలైన ప్రవేశ ఫలితాల్లో షిండే అజయ్, చౌదరి దివ్య, చిక్కాల తేజస్విని, గండ్రత్ అనూష, చేపూరి హర్షవర్ధన్ ప్రతిభ కనబర్చారని హెచ్‌ఎం రాజన్న తెలిపారు. గ్రామస్తులు, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

నేటితో ముగియనున్న కొనుగోళ్లు

బోథ్: బోథ్ మార్కెట్ యార్డు పరిధిలో మొక్కజొన్న కొనుగోళ్లు మంగళవారంతో ముగియనున్నట్లు సెంటర్ ఇన్‌చార్జి నాగభూషణం, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్ తెలిపారు. రైతులు తమ వద్ద మిగిలి ఉన్న మొక్కజొన్నను మార్కెట్ యార్డుకు తీసుకురావాలని సూచించారు.

నూతన మండల కమిటీకి సన్మానం

ఇంద్రవెల్లి: అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల నూతన కమిటీని ఇంద్రవెల్లి గ్రామ పటేల్, పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, మండల వ్యాపారుల సంఘం, గ్రామస్తులు మండలకేంద్రంలో సోమవారం సన్మానించారు. అధ్యక్షుడు, సభ్యులను అభినందించారు. ఎంపీపీ శోభాబాయి, మాజీ ఎంపీపీ తుకారం, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, ఏఎంసీ మాజీ చైర్మన్ వసంత్‌రావ్, రైతు సమన్వయ సమితీ మండల అధ్యక్షుడు హరిదాస్ ఉన్నారు.

నూతన కమిటీ నియామకం

నేరడిగొండ: కుమారి గ్రామంలో గొర్రెల పెంపకందారుల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కుమారి షీప్ బ్రీడర్స్ కోఆపరేషన్ సొసైటీ అధ్యక్షుడిగా భూస రిషికేష్, ఉపాధ్యక్షుడిగా బాదా వెంకటరమణ, కార్యదర్శిగా వి.చంద్రశేఖర్, సభ్యులుగా ఓర్స నీలాబాయి, భూస లలిత, ఓర్స రవి, గంగాధర్, బాస మల్లేశ్, లక్ష్మణ్ ఎన్నికయ్యారు.